# ఎ టెన్స్ ఆఫ్ ట్రూ లవ్

2005 క్రైన్ కథలపోటీలో
సాధారణ ప్రచురణకు
స్వీకరించిన కథ



శాంతి

"ప్రకాష్ సాయంత్రం త్వరగా వస్తావా?" ఆఫీసుకు పోబోతున్న భర్తను అడిగింది సుధీప్తి.

"ఎందుకు సుధీ?" తలమీద హెల్మెట్ పెట్టుకోబోతుఅడిగాడు.

"ఇంట్లో ఉండి ఉండి బోరు కొడు తుంది. అట్లా హుస్సేన్‌సాగర్ టాంక్‌బండ్ మీద నడుద్దామని..."

"ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా వస్తాను...." హడావుడిగా వెళ్లిపోయాడు ట్రాఫిక్ సమస్య గుర్తొచ్చి.

ప్రకాష్ పోగానే లోపలికొచ్చి బెడ్ మీద వాలిపోయింది. ఇప్పుడు చేయాల్సిన పనులు ఏమీలేవు. ఉన్నవి ప్రకాష్ చేసిపెట్టాడు. ఏం చేయాలి ఇప్పుడు? ఎందుకో ఈ మధ్య బద్ధకం ఎక్కువవుతుంది. దానికి తోడు చికాకు, అసహనం. తన శరీరంలో వస్తున్న మార్పులు దీనికి కారణమా? ఎంత ప్రేమించి చేసుకుంటే మాత్రం ! ఆలోచిస్తూ పక్కనే వున్న మ్యాగజైన్‌ను అందుకుంది. అలా తెరిచిందో లేదో ఫోన్ రింగ్....

"హాలో ఎవరు?"

"నేనే స్వప్నను..."

"స్వప్ననా ....?"

"ఏమె గుర్తుపట్టలేదానె నన్ను పోరి!"

ఈ మాటతో గుర్తుకు వచ్చింది. తన క్లాస్‌మేట్. ఇంటర్ నుండి బి.సి.ఎ. దాకా కలిసి చదివిన స్వప్న! బహుశా నాలుగైదు సంవత్సరాలు కావచ్చు విడిపోయి.

"ఏంటే బాగున్నావె, అసలు ఎక్కడ వున్నావు, ఏం చేస్తున్నావు, ఇంతకు ఎక్కడి నుండి ఫోన్ చేస్తున్నావు?", ఆత్రుతగా ప్రశ్నల వరంపర కురిపించింది సుధీప్తి.

"విజయవాడ నుండి సిటికొచ్చి వారమయిందే. దిల్‌సుఖ్‌నగర్‌లో వుంటున్నాను...."

"నా ఫోన్ ఎట్ల దొరికిందే!"

"అది రహస్యం గాని, నీ కొంపకు ఎలా రావాలో చెప్పు, వచ్చాక అన్ని మాట్లాడుకుందాం...".

"సుధా అపార్ట్‌మెంట్, చిక్కడవల్లి మెయిన్‌లోనే వుంటుంది. ఇప్పుడు వస్తున్నావె?"

"కాస్త పని వుంది. అది చూసుకొని ఓ గంటలో నీ దగ్గర వాల్తాను", ఫోన్ పెట్టేసింది స్వప్న.

గత జ్ఞాపకాలన్నీ ఒక్కసారిగా కండ్ల ముందు తిరిగినట్టయింది

సుధీప్తికి....

తను తెలంగాణ, అది ఉత్తరాంధ్ర. ఇద్దర్ని కలిపింది విజయవాడలోని ఓ రెసిడెన్షియల్ కాలేజి. ఆ కాలేజీలో చదివితే ఇంజనీరో, మెడికల్ సీటో గ్యారంటని తల్లిదండ్రుల నమ్మకం. వాళ్ల ఆశల్ని వమ్ము చేనన్తా వట్టువట్టి ఇద్దరం బి.సి.ఎ. పూర్తిచేయటం, ఉద్యోగ ప్రయత్నంలో తను హైదరాబాద్‌కు రావడం, అది పై చదువులంటు విజయవాడలోనే వుండిపోయింది.

తన సంస్థలో తనతోపాటు పనిచేస్తున్న ప్రకాష్‌తో గాఢ పరిచయం. తన భావాలను గౌరవిస్తాడనే నమ్మకం కుదిరినాక అతనితో కలిసి జీవించటానికి సిద్ధపడటం. తన తల్లిదండ్రులు ఎడముఖం, పెడముఖంగా వున్న అతనితో సింపుల్‌గా పెండ్లయిపోయింది. ఆ తొందరలో కనీసం స్వప్నలాంటి ఫ్రెండ్స్‌ను పిలవటానికి వీలుకాకపోయె. దాని పెండ్లి అయిందో లేదో....?

"కిర్..... కిర్...." మంటు కాలింగ్ బెల్ మోత.


పోయి తలుపు బోల్టు తీసి చూసేసరికి ఎదురుగ స్వప్న. లోపలికి వస్తూనే సుధీప్తిని కౌగిలించుకుంది.

"ఏందే ఇట్ల చిక్కిపోయినవు?"

"ప్రకాష్‌ను చేసుకొని హాయిగా వున్నావు. నాకు ఎటువంటి వాడు వస్తడోనని బాధతో ఇట్ల చిక్కిపోయిన...." నవ్వుతూ అంది స్వప్న.

"అసలు నా గురించి వివరాలు ఎలా తెల్సె!"

"కర్నూల్ ఫ్రెండ్ లేదే స్రవంతి, అది వోసారి అనుకోకుండా బస్సుల కల్సింది. నీ గురించి చెప్పింది. నీ దగ్గరకు వచ్చిపోయిందట గద అది!"




"వో అదా సంగతి, స్రవంతి కల్సిందా, ఇందాకటి నుండి తలకాయ బద్దలు కొట్టుకుంటున్న, నా గురించి ఎలా తెలిసిందాని, నరెగాని ఏమన్నా తీసుకుంటవానె?"

"ఇప్పుడెందుకుగాని, కొద్దిసేపాగి టీ తాగుదం"

"కొద్ది సేపు దాకా ఎందుకుగాని, నాకు తలనొప్పిగ వుంది" టీ పెట్టడానికి కిచెన్ రూంలోకి నడిచింది సుధీప్తి.

"ఏందే షేప్ మారినట్టుంది, ఏంటి విశేషం!" సుధీప్తి నడక తీరును గమనిస్తు అడిగింది స్వప్న.

'ఏముంది నా బొంద, అయిదో నెల...."

వో అలా చెప్పు. అందుకేన ఇలా అయిపోయినావు. నిన్నెందుకు కష్టపెట్టాలిగాని పోయి కూర్చో టీ కలుపుకొని వస్తా...."

"అంత వద్దులేవె. ..., ప్రకాష్ అంతా చేసిపెడతాడు. ఎంతసేపని వట్టిగా ఉండాలి. కొద్దిగ నన్న పని చేసుకోవాలిగా..."

"నీ కేందె ముత్యంలాంటి మొగుడు దొరికాడు..."

"వో మంచోన్ని చూసుకొని చేసుకోకపోయినవే"

"ఒకడేంది, ఇద్దరు దొరికారు.. ఎవర్ని చేసుకోవాల్నో అర్థం కావట్లేదు...."

"అమ్మా.... చాలా అడ్వాన్స్‌గా వుందే పోరి!, ఇంతకు వాళ్లు ఏం చేస్తున్నరే?"

"కో వర్కర్సె...."

"ఇద్దర్లో ఎవన్నో ఒకన్ని మంచోన్ని చూసి చేసుకొనపోయినవే?"

"ఆ ఇద్దర్లో ఎవడు మంచోడో తెలియకే ఈ బాధంతా...."

"ఎన్నేండ్ల నుండి సాగుతుందే?"

"జస్టు టు, త్రి ఇయర్స్ నుండి..."

"ఇద్దర్ని ప్రేమిస్తున్నవా మరి !"

"అవునె ఇద్దరితో ఇష్టంగానే వుంటాను.."

"అయితే ఇద్దర్ని చేసుకో పీడా పోతుంది!"

"ఛీ గబ్బుదాన వూరుకో..."

"పెండ్లి ప్రపోజల్ ఎవరు తెచ్చారే?"

"వాళ్లే తెచ్చారు ముందు..."

"ఎట్ల సాల్వ్ అయితదే నీ ప్రాబ్లమ్?" దీర్ఘంగా ఆలోచనల్లో పడింది సుధీప్తి.

"అందుకేగా నిన్ను వెతుక్కుంటు వచ్చింది. కాలేజీలో ఏ సమస్య వచ్చిన నీవె సాల్వ్ చేసేదానివి గదా మన ఫ్రెండ్స్‌కు, ఇప్పుడు ఏదో మార్గం చూపేయి...."

"నా కోసం కాదన్నమాట వచ్చింది, ఇంత కుట్రలతో, కుతంత్రాలతో వచ్చినవన్నమాట నా దగ్గరకు!"

"కుట్రలో, కుతంత్రాలో.... ఏవో తెలియవే, నా సమస్యకు పరిష్కారం చెప్పవే..."

"ఆ ఇద్దరి హీరోల పేరేమిటో?

"ఉదయ్, అజయ్..."

"ఇద్దరు బాగా ప్రేమిస్తున్నరానె"

"ఇద్దరు బాగానే వుంటారు. ఎవర్ని వదులుకోవాలో అర్థం కావటంలేదు. లక్కీగా మా 'ఇన్ఫోటెక్' సంస్థ వాళ్లు విజయవాడ బ్రాంచి నుండి దిల్‌సుఖ్ నగర్ బ్రాంచ్‌కు మార్చారు.....".

"పంపి మంచి పనిచేశారే..."

"వచ్చేటపుడు ఉదయ్ ఏమన్నాడో తెలుసా! వారం రోజుల్లో నా నిర్ణయం చెప్పకుంటే ప్రకాశం బ్యారేజి మీద నుండి కృష్ణానదిలో దూకి చస్తానన్నాడు పాపం, అసలే ఈ సంవత్సరం వరదలు గూడ ఎక్కువున్నయి".

"దూకనీయవే పీడా పోయిద్ది, ఒకడు మిగులుతడు నీ సమస్య తీరు తుంది....".

"అలా మాట్లాడుతవేందే పాపం...."

"పాపం లేదు గీపం లేదు గాని, ముందు నీ అమాయకత్వాన్ని వదులుకో. ఆ ఇద్దర్లో ఎవడు మెరుగో నిర్ణయం చేసుకో. అప్పుడు సమస్య పరిష్కారమవుతుంది...."

"అది తేల్చుకోలేకనే నీ దగ్గరకు వచ్చింది" అమాయకంగా ముఖం పెట్టింది స్వప్న.

"అయితే ఆ ఇద్దర్లో ఎవరు నిన్ను

నిజాయితీగా ప్రేమిస్తున్నారో తేల్చాలి అంతేగదా?" స్వప్న ముఖంలోకి చూస్తూ అంది.

"అవునే సుధీ...."

"అయితే నేను చెప్పినట్టు చేస్తావా?"

''అందుకే గదా నీ దగ్గరకు వచ్చింది...."

"పదో తరగతిలో "ఎ టెస్ట్ ఆఫ్ ట్రూ లవ్" పాఠం గుర్తుందా?"

"ఏమోనె సరిగా గుర్తులేదు...."

"పరవాలేదు. వాళ్లిద్దరికి చిన్న టెస్ట్. ఎవరు నిన్ను నిజంగా, నిజాయితీగా ప్రేమిస్తున్నారో తేలిపోయిద్ది'.

"ఏమిటె ఆ టెస్ట్?", ఆత్రుతగా సుధీప్తి దగ్గరకు జరుగుతూ అంది స్వప్న.

"అయితే విను...." తను పెట్టబోయే టెస్ట్ వివరించింది సుధీప్తి.

"వామ్మో ఇదేమి టెస్టే?" అంతా విన్నాక ఎగిరిపడింది స్వప్న.

"మంచి మొగుని కోసం ఈ టెస్ట్!"

"ఏమో సుధీ, భయంగా వుంది, వాళ్లు మిస్ అండర్‌స్టాండింగ్ చేసుకుంటే?"

"మిస్ అండర్‌స్టాండింగ్ లేదు, పాడు లేదుగాని నేను చెప్పినట్టు విను...."

"ఏమోనె నాకు భయంగా వుంది...."

"భయంలేదు గియంలేదు గాని, వారం రోజుల్లో చెప్పకుంటే చస్తానంటుందుగా ఆ ఉదయ్. ఆ హీరోను రేపు ఇరవైకి ఇక్కడికి పిలిపించు. ఇరవై అయిదుకు అజయ్‌ను పిలువు. నేను చెప్పినట్లు చేయి. ముప్పయి తారీఖున రిజల్ట్సు బయటపడతవి. నీవేమి భయపడకు...."

"ఏమోనె అనవసరంగ నీ దగ్గరకు వచ్చి ఇరుక్కుపోయిన..." భయం భయంగానె ఒప్పుకుంది.

"ఎందుకే అంత భయం. వీళ్లద్దరు కాకుంటె, ఇంకొకడు. నీ అందం, తెలివి, చలాకితనం చూసి ఎవడైన చేసుకుంటాడు నిన్ను..."

"పెండ్లి అయితదో, కాదో అని గాదు నా భయం. నీవు పెట్టిన టెస్ట్ భయంగా వుందే నాకు. చేయక చస్తనా.....", ఉదయ్‌కు, అజయ్‌కు ఫోన్ చేయటానికి సిద్ధమయింది స్వప్న.

☆ ☆ ☆

".... టైం గూడ దాటిపోయె, వస్తడా రాడా? అయినా ఒకటికి రెండు సార్లు చెప్పితి, సంధ్య టాకీస్, ఆర్.టి.సి. క్రాస్ రోడ్డని, మిస్ కావటానికి అవకాశం లేదే....' ఆందోళన పెరగసాగింది లోపల స్వప్నకు.

గేటు దగ్గర ఆటో దిగుతున్న ఉదయ్‌ను చూసేసరికి ప్రాణం లేచొచ్చినంతయింది. సరాసరి స్వప్న దగ్గరకు వస్తూనే.

"సారీ స్వప్న ఆలస్యమయినందుకు, ఇక్కడ అక్కడ కాదు విజయవాడ నుండాయె రావటం...."

"సంజాయిషి వద్దు, మార్నింగ్ షోకు పోదామా లేకుంటే రెస్టారెంట్‌లో కూర్చుని మాట్లాడుకుందామా?"

"ఎక్కడికైన పర్వాలేదు..." దగ్గర్లో టాకీసు వాల్ మీదున్న పోస్టర్ మీద పడింది దృష్టి.

"నీ మనసు నాకు తెలుసు" నవ్వుతూ పైకి అనేశాడు.

"అయితే పోదామా ఆ సినిమాకు...."

"పోదాం..." పరిగెత్తి రెండు టికెట్లు పట్టుకొచ్చాడు. పెద్దగా పబ్లిక్ గూడ లేదు. ఇద్దరు లోపలికి పోయి జనం లేనిచోట ఓ మూలకు కూర్చున్నారు.

"ఏంటి స్వప్న ఇంత అర్జంటుగ పిలిపించావు? మీ వాళ్లు పెండ్లి సంబంధం చూస్తున్నారా ఏంటి?" చనువుగా స్వప్న చేతిని తన చేతిలోకి తీసుకుంటు

"పెండ్లి సంబంధం లేదు ఏమీ లేదు" అంతే చనువుగా ఉదయ్ చేయిని పక్కకు తోస్తూ అంది.

''మరెందుకు పిలిపించావు?'' అనుమానంతో అడిగాడు ఉదయ్.

"చెప్పుత అంత తొందరెందుకు?" అన్నదే గాని ఎలా మొదలుపెట్టాల్నో అర్థం కావటంలేదు.

వీరిద్దరికి చుట్టు పక్కల ఎవరులేరు. స్వేచ్ఛ దొరికినట్టయింది. అప్పటికి సినిమా మొదలయింది. ఉదయ్ మొదలుపెట్టాడు.

"స్వప్న గుర్తుందా?ప్రకాశం బ్యారేజి... కృష్ణానది...."

"గుర్తుంది అందుకే పిలిచాను...."

"అయితే ఎప్పుడు మన మ్యారేజి?" ఇద్దరి జీతాలు కలిస్తే ఎంతవుతుందో ఊహిస్తూ.

"విషయం దాచటం ఎందుకు? పెండ్లికి ముందే చెపుతున్నాను" చిన్నగా అంది.

"దేని గురించి స్వప్న?" ఎడమ కన్ను అదురుతుండగా

"ఈ మధ్య నా ఫ్రెండ్‌కు రక్తం ఇవ్వ బోయాను. ఆ సందర్భంలో చేసిన రక్తపరీక్షలో తేలింది నాకు 'హెచ్ఐవి' పాజిటివ్ లక్షణా లున్నాయని. ఇప్పుడిప్పుడే స్టార్టింగట, తగ్గినా తగ్గొచ్చట...."

"నీకెలా వచ్చింది స్వప్న? నీవటు వంటి దానివి కాదుకదా?" భయకంపితు డౌతూ.

"నీకు తెలియదా నా గురించి. ఎలా వచ్చిందో అర్థం కావటంలేదు. ఒక్కోసారి పాజిటివ్ రావచ్చని డాక్టర్లు అంటున్నారు..."

అర్ధగంట దాక ఇద్దరి మధ్య మౌనం. ఉదయ్‌కు ముళ్ల మీద కూర్చున్నట్టుంది. స్వప్న పక్కనగాకుండ అగ్నిగుండం పక్కన కూర్చు న్నట్టుంది. తెరమీద ఎగురుతున్న బొమ్మలు గుండెమీద తంతున్నట్లున్నాయి.

"ఏంటి ఉదయ్ మాట్లాడవు? మ్యారేజి ఎప్పుడు, ఎక్కడ?"

"అదే ఆలోచిస్తున్నా స్వప్న, విజయ వాడ పోగానే మ్యారేజి విషయం వ్రాస్తాను...." ఇంటర్‌వెల్ అయింది. ఇద్దరు బయటకొచ్చారు. గాలి తీసిన బెలూన్‌లా అయ్యాడు ఉదయ్.

"స్వప్న రెండు గంటలకు ట్రెయిన్ వుందికదా. దానికెళతాను. రేపు అర్జంటుపని వుంది, ఏమంటావు?" "నీ ఇష్టం ఉదయ్, స్టేషన్‌దాక రావాలా?"

"ఆ... వద్దులే స్వప్న, అంత రిస్కు ఎందుకు నీకు, నేను పోతాను గదా..." ఇద్దరు బయటకొచ్చారు.

"ఏ ఆటో..." గేటు దగ్గరున్న ఆటోను పిలిచాడు.

"ఆరోగ్యం జాగ్రత్త, పోగానే జాబు వ్రాస్తాను". ఆటో ఎక్కుతూ అన్నాడు ఉదయ్.

సికింద్రాబాద్ స్టేషన్ వైపు స్పీడ్‌గా దూసుకుపోతున్న ఆటోను చూస్తూ అలాగే నిలబడిపోయింది స్వప్న.

☆ ☆ ☆

"ఏంటి స్వప్న, ఇంత ఆలస్యమా..." నిష్ఠూరమాడాడు అజయ్.

"సారి అజయ్, ఎంత సేపయింది వచ్చి?"

పది గంటలకే వచ్చాను. ఎప్పుడు వస్తుందాని ఈ దేవత కోసం కండ్లు కాయలు కాసేటట్టు చూస్తున్నాను...".

"మాటలు వద్దుగాని సినిమాకు పోదామా, రెస్టారెంటులో కూర్చుందామా?"

"థియేటర్‌లో అయితే గోల. రెస్టారెంట్‌లో అయితే టీ తాగుతూ హాయిగా మాట్లాడుకోవచ్చు...."

"అయితే పద దగ్గర్లోనే వుంది..." ఇద్దరు ప్రిన్స్ రెస్టారెంట్‌లోకి పోయారు.

"ఎలా వుంది కొత్త బ్రాంచ్‌లో...?"

"ప్రాంతం కొత్తది, పని పాతదే గదా!"

"అర్జంటుగ పిలిచావు, ఏమిటి విశేషం?"

"ఇంకా దాచటం ఎందుకు? మ్యారేజ్ ప్రపోజల్ పెడితివి గదా, దాని గురించి మాట్లాడడానికి పిలిచా..." టీ తాగుతూ నెమ్మదిగా అంది.

"మీ వాళ్లు ఒప్పుకున్నారా?"

"ఒప్పుకున్నట్లె, కాని పెళ్ళికి ముందు నీకో విషయం చెప్పాలి, పిదప నీ యిష్టం..." హెచ్ఐవి పాజిటివ్ కథంతా చెప్పింది.

"నమ్మలేకుండా ఉన్నా స్వప్న..."

"నీవు నమ్ముకున్న వాస్తవం అది...."

"....................................."

"ఇప్పుడు చెప్పు నా మీద అభిప్రాయం ఏమిటి?" నిశ్శబ్దంగా కూర్చున్న అజయ్ ముఖంలోకి చూస్తూ అంది.

"నీ మీద ఎప్పుడు ఒక్కటే అభిప్రాయం, రెండో అభిప్రాయం లేదు" స్వప్న చేతిని నెమ్మదిగ తన చేతిలోకి తీసుకుంటూ

"రెండు గంటలకు ట్రెయిన్ ఉందిగదా వెళ్తవా!"

"సాయంత్రం వరకు వుంటే ఇబ్బందా?"

"నాకేమీ ఇబ్బంది లేదు, ఎక్కువ సేపు కూర్చోలేం గదా ఇక్కడ?"

"అయితే స్టేషన్‌లో కూర్చుందాం పా..." బయటకు వచ్చి ఆటో ఎక్కారు.

"నాకు సాయంత్రం పని ఉంది అజయ్"

"ఇంతదూరం వచ్చాను దయలేదా?" చేతిని ముద్దు పెట్టుకుంటూ అన్నాడు. గబుక్కున తన చేతిని లాక్కుంటూ అంది.

"ఈసారి వచ్చినపుడు నా రూంకు తీసుకెళతా...." మధ్యలో ఆటో దిగుతూ అంది.

"పోగానే జవాబు వ్రాస్తావుగా?" తిరిగి అడిగింది.

"తప్పక వ్రాస్తాను.... బై...." వేగంగా వెళ్లిపోయింది ఆటో.

☆ ☆ ☆

"ఇద్దరి జవాబులు వచ్చినయి చదువమంటావా?" కొరియర్‌లో వచ్చిన కవర్స్ చింపుతు అంది సుధీప్తి.

"చదువు....." భయంతో.

"భయపడకు, గుండె ధైర్యం చేసుకో, వీళ్లు కాకుంటే ఇంకొకడు.... ఎవరిది ముందు చదవాలి ఉదయ్‌దా, అజయ్‌దా?"

"చంపక నన్ను ఏదో ఒకటి చదువు...."

"ముందు ఉదయ్ కలిశాడు కాబట్టి అతనిది చదవటమే న్యాయం.....", చదవటం మొదలు పెట్టింది.

మిత్రురాలు స్వప్నకు,

నీగురించి సీరియస్‌గా ఆలోచించాను. ఆవేదనపడ్డాను. నీకు ఆ వ్యాధి ఎలా వచ్చిందో అర్థం కావటంలేదు. వట్టిగ రాదు, ఏదో జరిగి ఉంటుంది! నీ శీలాన్ని అనుమానిస్తున్నానని కాదు. నీమీద గౌరవం వుంది. ప్రేమ వేరు జీవితం వేరు.

చివరగా, నేను ఎంత వద్దంటున్నా నా తల్లిదండ్రులు వచ్చే వారంలో మ్యారేజి ఫిక్స్ చేశారు. చేసుకోనంటే చస్తామని బెదిరిస్తున్నారు. విధి లేని పరిస్థితుల్లో ఒప్పుకోవలసి వచ్చింది. నీ క్షేమాన్ని కోరుతూ..

మీ స్నేహితుడు

ఉదయ్.

ఉత్తరం పూర్తి చేసింది సుధీప్తి. ఇద్దరి మధ్య మౌనం. మౌనాన్ని భంగపరుస్తూ అంది సుధీప్తి.

"అధైర్యపడకు, రెండో లెటర్ చదువుతూ, ఏముందో చూద్దాం..."

డియర్ స్వప్న,

నిజంగా నీవు నా ప్రేమ స్వప్నానివి. ఆ స్వప్నం కలలాగ కరిగిపోతున్నం దుకు బాధ. అందుకే ఎంతత్వరగా నీతో కలిసి జీవించటమే నా ఆరాటం. కలిసి జీవించటం అన్నది శారీరకంగా కాదు మానసికంగా కలిసి జీవించవచ్చునన్నది నా విశ్వాసం. ఈ పరిస్థితుల్లో నీతో కలిసి జీవించటం నా బాధ్యత. ఇక్కడ బ్రాంచి నుండి హైద్రాబాద్‌కు పంపుతామంటున్నారు. మనం కలిసి జీవించటానికి అవకాశం ఏర్పడింది!

నీ

అజయ్.

"అమ్మయ్య,బతికించాడే నీ అజయ్..." ఉత్తరాన్ని స్వప్న చేతిలో పెడుతూ అంది.

"నిజంగా అలా రాశాడా?" మరోసారి చదువుకుంది స్వప్న.

"అదృష్టవంతురాలివి! టెస్ట్‌లో మంచోన్ని పట్టినవు. ఈ కాలంలో ఇటువంటి వాళ్ళూఉన్నారే!"

"కోటికి ఒక్కరో ఇద్దరు ఉంటరు, నా అజయ్‌లాంటోడు....!" గొప్పలు పోతూ అంది స్వప్న.

"అంత బిల్డప్ వద్దుగాని, ఎందుకైన మంచిది అసలు విషయం చెప్పు నీకు ఏ రోగం లేదని. అజయ్ మనసు మారిందంటే నీ బతుకు ఆగమైతది!"

"ఎందుకంత కుళ్లు, నా అజయ్ అలాంటోడు కాదు, ఇప్పుడే ఫోన్ చేస్తాను..." ఉత్తరాన్ని ముద్దు పెట్టుకుంటు అంది.